పీఏసీఎస్‌లో ఎరువుల విక్రయ కేంద్రం



ఎరువుల విక్రయాన్ని ప్రారంభించిన పాలకవర్గ సభ్యులు

శంషాబాద్: రైతుల సౌకర్యం కోసం శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో ఎరువుల విక్రయాన్ని ప్రారంభించినట్లు చైర్మన్ ముద్దం మల్లారెడ్డి తెలిపారు. ఎరువుల విక్రయాన్ని బుధవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల వినతి మేరకు పాలకవర్గం ఈ కేంద్రాన్ని ప్రారంభించిందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌యాదవ్, పాలకవర్గ సభ్యులు అరుంధతి, శ్రీనివాస్, మైలారం సులోచన, పోచయ్య, శ్రీనివాస్ యాదవ్, సీఈఓ అర్జున్, ఉద్యోగులు జగన్ మోహన్, ఫిలోమెన్, సదాశివరెడ్డి, వెంకటేష్, రాంరెడ్డి రైతులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో కూలిన చెట్టు



కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో మణికొండ మున్సిపాలిటీ, శ్రీరాంనగర్ కాలనీలో బుధవారం ఓ పెద్ద చెట్టు కూలింది. బుధవారం మధ్యాహ్నం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఓ మోస్తారు వర్షం కురిసింది. కొన్ని గంటలు విరామం ఇచ్చిన తరువాత సాయంత్రం తిరిగి కురిసింది. గాలి తీవ్రంగా రావటం, చెట్టు ఎత్తుగా పెరిగి ఉండటంతో అది కూలిపోయిందని కాలనీవాసులు తెలిపారు. సమాచారం అందుకున్న మున్సిపాలిటీ సిబ్బంది దాన్ని కట్ చేసి పక్కకు తొలగించారన్నారు.

దంచికొట్టిన వర్షం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిధిలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం 5 గంటల నుంచి తిరిగి వర్షం మొదలై రాత్రి వరకు కురిసింది. వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మాల్స్, వ్యాపార కేంద్రాల వద్ద ప్రజలు మందకొడిగా కనిపించారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలకు ఒంటి పూట తరగతులను నిర్వహించారు.

పురాతన ఇళ్ల కూల్చివేత



మణికొండ: భారీ వర్షాలకు ప్రమాదకరంగా ఉన్న పురాతన గృహాలను నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి కూల్చివేయించారు. మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, మంచిరేవులలో ఉన్న రెండు గృహాలను గుర్తించి బుధవారం కూల్చివేశామన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో అవి కూలి ఇతరులకు ప్రమాదం జరిగేలా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి గృహాలు ఉంటే మున్సిపల్ సిబ్బంది, అధికారుల దృష్టికి తెచ్చి ప్రజలు ప్రమాదాలను నివారించాలన్నారు.

పల్టీ కొట్టిన ట్రాక్టర్

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



మణికొండ: స్లాబ్ వేసేందుకు మిల్లర్‌తో పాటు వస్తున్న ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలోని రోడ్డు నెంబర్ 5లో ఓ ఇంటి నిర్మాణం జరుగుతుంది. బుధవారం స్లాబ్ వేసేందుకు మిల్లర్ వస్తున్న క్రమంలో రోడ్డు ఎత్తుగా ఉండటంతో ట్రాక్టర్ బరువును లాగలేకి పల్టీ కొట్టింది. ఆ సమయంలో అటుగా ఎలాంటి వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పిందని, ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయన్నారు.

వాగుల్లో వ్యర్థాలు

- చెత్త సేకరణలో నిర్లక్ష్యం
- డంపింగ్ యార్డులను వదిలి ఖాళీ ప్రదేశాల్లో పారబోత
- రోడ్ల పక్కన, వరద కాలువల్లో చెత్త పారబోత



కాచారం శివారులో ఎంటేరువాగులో పారబోసిన చెత్త

శంషాబాద్ రూరల్: డంపింగ్ యార్డులకు తరలించాల్సిన చెత్త, వ్యర్థాలు వాగుల్లో చేరుతున్నాయి. పంచాయతీ అధికారుల ఉదాసీన వైఖరికితోడు గ్రామస్తుల నిర్లక్ష్యంతో నీటి వనరులు దుర్గంధంగా మారుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన చెత్తను రోడ్లు, ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. అంతేకాకుండా వరద కాలువలు, వాగుల్లో పారబోస్తుండటంతో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

వాగులు, వంకల్లోకి...

గ్రామాల్లో కొన్ని చోట్ల చెత్తను వాగులు, వంకలు, కుంటలు, చెరువుల్లో పారబోస్తున్నారు. మాంసం దుకాణాల్లోని వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేస్తున్నారు. దుకాణాలు, విద్యా సంస్థల్లోని చెత్తను పరిసర ప్రాంతాల్లో పడేసి చేతులు దులుపకొంటున్నారు.

- పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు కళ్లు మూసుకు కూర్చుంటున్నారు. గ్రామాల్లో చెత్తను సరైన పద్ధతిలో సేకరించి డంపింగ్ యార్డులను సద్వినియోగం చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



ఖాళీ ప్రదేశంలో పడేసిన చెత్త



రాయన్నగూడలో దేవాలయం సమీపంలో చెత్త



రాయన్నగూడలో ఖాళీగా ఉన్న డంపింగ్‌యార్డు

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు...

పంచాయతీ పరిధిలో అన్ని చోట్ల డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. పంచాయతీ సిబ్బంది ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంటుంది. కొంత కాలంగా చెత్త సేకరణ గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారింది.

- తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలో సిబ్బందితో పాటు ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం దృష్టి సారించకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుల్లో వేర్వేరుగా నిల్వ చేయాల్సి ఉంటుంది. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారుకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు.
- సేకరించిన చెత్తను ఇష్టానుసారంగా డంపింగ్ యార్డుల్లో పారబోస్తున్నారు. కొన్ని చోట్ల ఈ చెత్తను రోడ్ల పక్కన, గ్రామ శివారుల్లోని ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తున్నారు.

ప్లాస్టిక్ భూతంతో ఎన్ని ఇబ్బందులో...

గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. చెత్తలో సింహ భాగం ప్లాస్టిక్ ఉంటుండంతో వాతావరణ కాలుష్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కొన్ని చోట్ల సేకరించిన చెత్తలో ఉన్న ప్లాస్టిక్‌ను తగలబెట్టి చేతులు దులుపుకుంటున్నారు. వరద కాలువల్లో పారేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో వరద నీటికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

నియామకం



రాజేంద్రనగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా అత్తాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగోని భాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 18న రవీంద్రభారతిలో నిర్వహించే జయంతి ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గౌడ కులస్తులు, బహుజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

చెరువైన శంషాబాద్ బస్టాండ్!



శంషాబాద్: భారీ వర్షంతో శంషాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చెరువుగా మారింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీటితో పూర్తిగా నిండిపోవడంతో మోకాలులోతు వరకు నీటితో నిండిపోయింది. దీంతో బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయి. పట్టణంలోని మధురానగర్ కాలనీ, ఆర్బీ నగర్ కాలనీ రైల్వేస్టేషన్, సాయికాలనీ తదితర ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలకు పరిసరాల పరిశుభ్రతలపై ప్రతి కాలనీ, బస్తీలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా బుధవారం జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని ఆనంద్‌నగర్ ఎంక్లేవ్‌లో తడి, పొడి, హానికర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ ఎస్.వెంకటప్ప, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత షురూ



మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు

శాస్త్రిపురం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బుధవారం ఉదయం నంచి వర్షం పడటంతో శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌లలో రహదారులు జలమయంగా మారాయి. గుంతలు, ఖాళీ స్థలాలు నీటితో నిండిపోయాయి. హాజన్‌నగర్, మమ్మద్‌నగర్, నౌనంబర్, వాదియామహ్మద్‌నగర్, సులేమాన్‌నగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్‌లు నిండిపోయి డ్రైనేజీ నీటితో కలిసి వర్షపు నీరు సైతం రోడ్లపైకి వస్తోంది. మట్టితో మ్యాన్‌హోల్‌లు నిండిపోవడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది పూడికతీత పనులు ప్రారంభించారు. మురుగునీరు రహదారులపైకి రావడంతో పలు బస్తీలు దుర్గంధ మయంగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లకు ఆనుకొని ఉన్న మీరాలం చెరువులోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

జిల్లా రవాణాశాఖ కమిషనర్ సదానందం



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీటీసీ సదానందం

మణికొండ: డ్రగ్స్ వాడకం వలన శరీర భాగాలు పట్టుతప్పి తొందరగా వృద్ధాప్యం రావటంతో పాటు జీవితం నాశనం అవుతుందని, దానికి దూరంగా ప్రతి ఒక్కరు జీవించాలని జిల్లా రవాణా శాఖ కమిషనర్ సదానందం అన్నారు. మణికొండలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రగ్స్ మహమ్మారిని మన రాష్ట్రం నుంచి తరిమేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. డ్రగ్స్ వాడే వారితో పాటు రవాణా చేసే వారి వివరాలను ప్రజలందరూ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపుడే రాబోయే సమాజం దానికి దూరంగా ఉంటుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారులు హేమంత్, పద్మ, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీణ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'నిషా'చరులకు జైలు శిక్ష



ప్లకార్డు పట్టి అవగాహన కల్పిస్తున్న సందీప్

మణికొండ: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ నార్సింగి పోలీసులకు చిక్కిన వారికి రాజేంద్రనగర్ కోర్టు బుధవారం శిక్షలు విధిస్తూ తీర్పుచెప్పింది. పోలీస్‌స్టేషన్ పరిధిలో రెగ్యులర్‌గా నిర్వహించే తనిఖీలలో మొత్తం 9 మంది దొరికారని, వారిని కోర్టులో హాజరు పర్చామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారిలో ఆరుగురికి రూ. వెయ్యి నుంచి రూ. 3 వేల వరకు జరిమానాలు విధించిందన్నారు. హిమాయత్ సాగర్‌కు చెందిన వెంకటేశ్‌కు మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించిందన్నారు. ఇతను గతంలో ఐదు సార్లు మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పోలీసులకు దొరికాడన్నారు. దర్గా ఖలీజ్‌ఖాన్‌కు చెందిన ఎస్.రాములుకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించిందని తెలిపారు. పురానాపూల్‌కు చెందిన సందీప్‌కు ఒక రోజు సోషల్ సర్వీసు చేయాలనే శిక్షతో పాటు రూ. 2500 జరిమానా విధించిందన్నారు. దాంతో సందీప్‌ను బుధవారం రోజంతా మై హోం అవతార్ సర్కిల్‌లో మద్యం తాగి వాహనాలను నడపవద్దని ప్లకార్డు పట్టించి ప్రజలకు అవగాహన కలిప్పించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

వరదలో మునిగిన హనుమాన్ ఆలయం



ఈసీ నదిలో మునిగిన ఆలయం

బండ్లగూడ: ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హిమాయత్‌సాగర్ చెరువుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలమండలి అధికారులు గేట్లను తెరిచి నీటిని దిగువకు పంపిస్తున్నారు. క్రస్ట్ గేట్లు తెరిచి నీటిని వదులుతుండటంతో వరద ప్రవాహం ఈసీ, మూసీ నది గూండా ప్రవహిస్తుంది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ బ్రిడ్జి ప్రాంతంలో ఉన్న హనుమాన్ ఆలయం ఈసీ వాగు ప్రవాహానికి పూర్తిగా మునిగిపోయింది. వర్షం కురిసిన ప్రతిసారి వరద నీరు ఈ దేవాలయం గూండా ప్రవహిస్తుంటాయి.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

బండ్లగూడ: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావద్దు అన్నారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండడం, వాహనాదారులు రోడ్డుపై నెమ్మదిగా వెళ్లాలన్నారు. ప్రజలందరూ కూడా విద్యుత్, మున్సిపల్ అధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించాలన్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిరంతరం పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యవసర సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

బండ్లగూడ: సామాజిక న్యాయ, సాధికారత సంస్థ వారి సూచనల మేరకు నశ ముక్త భారత్ కార్యక్రమంల్లో భాగంగా బుధవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల ద్వారా జరిగే అనర్థాల గురించి అధికారులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల బారిన పడకుడదని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణాలను సహించరాదని అలాంటి వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. మేనేజర్ టి.పర్వతాలు, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వివిధ సెక్షన్‌ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో నెల రోజుల పాటు సాగే శిక్షణ తరగతులు ఈ నెల 20 నుంచి ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రతులతో పాటు పాస్‌పోర్టు సైజు 3 ఫొటోలను ఈ నెల 18లోపు సమర్పించాలని వారు వివరించారు.

గురుకుల హాస్టల్‌లో అగ్ని ప్రమాదం?

మణికొండ: నార్సింగిలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల వసతి గృహంలో బుధవారం విద్యుదాఘాతం కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యార్థినులు పాఠశాలలో ఉన్న సమయంలో సంఘటన చోటుచేసుకోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ వైర్లు కాలి మంటలు లేచి వసతి గృహంలోని బెడ్లు, దుస్తులకు అంటుకున్నాయని విద్యార్థినులు తెలిపారు. గమనించిన సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను ఆపివేసి నీటిని చల్లి మంటలను అదుపు చేశారన్నారు. వందల మంది విద్యార్థినులు ఉండే వసతి గృహాల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని తల్లితండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి



హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మణికొండ: ఆపరేషన్ సింధూర్‌లో ఉగ్రవాదులకు, శత్రుదేశానికి మన సైన్యం తగిన గుణపాఠం చెప్పిన వైనాన్ని కీర్తిస్తూ, సైనికులకు మద్దతుగా ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వారికి సంఘీభావం తెలపాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మణికొండ ప్రాథమిక పాఠశాలలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపుతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను వారి ఇంటిపై ఎగురవేయాలన్నారు. మన దేశానికి సైనికులు, పోలీసులు చేస్తున్న సేవలను గుర్తు చేసుకోవాలన్నారు. బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు సత్యనారాయణ, నాయకులు శ్రీకాంత్‌స్వామి, జె.సిద్దప్ప, సి.బీరప్ప, వేణుకుమార్, అనితాదేవి, మధు ఆనంద్ రావు, ప్రధానోపాధ్యాయుడు దశరథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న దృశ్యం

మణికొండ: పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు ఐటీ, సేవా సంస్థలు అండగా నిలిచి అన్ని సౌకర్యాలను కల్పించే బాధ్యత తీసుకోవాలని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్లూ యోండర్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ఉమెన్ వాల్యూస్ సంస్థలు నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాలే అన్ని సౌకర్యాలు కల్పించాలంటే సంవత్సరాల కాలం పడుతుందన్నారు. అదే ఇలాంటి సంస్థలు ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలను త్వరగా కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, అరుణ్‌కుమార్‌లతో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయుడు సునిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ముస్తాబు

అత్తాపూర్: హర్‌ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాలను... పరిసరాలను శుభ్రం చేశారు. హైదర్‌గూడ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఎన్ఎంగూడలోని భగత్‌సింగ్, ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాలను నాయకులు, కార్యకర్తలు శుభ్రపరిచి ముస్తాబు చేస్తున్నారు. తిరంగా యాత్రలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపైన జాతీయ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా సెక్రటరీ కొమురయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడం సుధాకర్, అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్‌కుమార జయానంద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల జగన్, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ధర్నా

రాజేంద్రనగర్: అనుమతులు లేని పరిశ్రమలు, పొల్యూషనల్ బోర్డు అనుమతులు లేని పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జాజాల రుద్రకుమార్ అన్నారు. సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన జాజాల రుద్ర కుమార్ మాట్లాడుతూ... అనుమతులు లేని పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని పరిశ్రమలను వెంటనే మూసివేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి వీసీకే భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి బి.వెంకటయ్య, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లోని శివరాంపల్లి వీకర్ సెక్షన్ విద్యానగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పాటై దశాబ్దాలు గడుస్తున్నా.. మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటి సమస్య ఉందని.. మంచినీటిని అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పొంగుతున్న డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. విద్యానగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. నేతలు పడమటి శ్రీధర్ రెడ్డి, మాదూరి ప్రభాకర్ రెడ్డి, జీవన్‌దాస్, దాసరి రమేష్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.